


**నేటి మ్యాచ్**
అఫ్గానిస్థాన్ X శ్రీలంక
మ. 2.00 నుంచి
వేదిక: పుణె

# నేషనల్ గేమ్స్ ఆతిథ్య అవకాశమివ్వండి

### ఐవోఏ సీఈవోను కోరిన జగన్‌మోహన్‌రావు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణకు జాతీయక్రీడలను నిర్వహించే అవకాశమివ్వాలని భారత ఒలింపిక్ సంఘం(ఐవోఏ)సీఈవో కల్యాణ్ చౌబేను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు కోరారు. ఫుట్‌బాల్ ఐ-లీగ్‌లో భాగంగా ఆదివారం శ్రీనిధి దక్కన్ ఎఫ్‌సీ, నెరోకా ఎఫ్‌సీతో జరిగిన మ్యాచ్‌కు జగన్‌తో పాటు కల్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇటీవలే హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఎన్నికైన జగన్‌ను కల్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. వీరిద్దరి మధ్య జరిగిన భేటీలో జాతీయ క్రీడల అంశం చర్చకు వచ్చింది. వచ్చే నాలుగేండ్ల వ్యవధిలో నేషనల్ గేమ్స్ నిర్వహణ తమకు ఇవ్వాలని జగన్ కోరగా అందుకు కల్యాణ్ సానుకూలంగా స్పందించారు. దీంతో పాటు ఇటీవల



ముంబైల జరిగిన ఐవోసీ సమావేశాల గురించి ఇరువురు చర్చించుకున్నారు. ఈ భేటీలో రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఫాల్గుణ పాల్గొన్నారు.

# టాప్-7 జట్లకు నేరుగా అర్హత

ముంబై: వన్డే ప్రపంచకప్‌లో టాప్-7లో నిలిచిన జట్లు 2025లో జరిగే చాంపియన్స్ ట్రోఫీకి నేరుగా అర్హత సాధించనున్నాయి. ఆతిథ్య హోదాలో పాకిస్థాన్‌కు బెర్తు ఖాయం కాగా, టోర్నీలో ఎనిమిది జట్లు పోటీపడనున్నాయి.2025లో జరిగే చాంపియన్స్ ట్రోఫీ కోసం 2021లో ఐసీసీ ఆమోదముద్ర వేసింది. పలు మెగాటోర్నీల ఆతిథ్య వేదికలను ఐసీసీ ఇప్పటికే ఖరారు చేసిన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది అమెరికా-వెస్టిండీస్ సంయుక్త ఆతిథ్యంలో టీ20 ప్రపంచకప్ టోర్నీ జరుగనుంది.



# వ్రితికి కాంస్యం | 37వ నేషనల్ గేమ్స్

పనాజీ: గోవా వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక నేషనల్ గేమ్స్‌లో తెలంగాణ పతక జోరు కొనసాగుతున్నది. ఆదివారం జరిగిన మహిళల 200మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో రాష్ట్ర యువ స్విమ్మర్ వ్రితి అగర్వాల్ కాంస్య పతకంతో మెరిసింది. ఆఖరి వరకు ఉత్కంఠగా సాగిన రేసులో దినిధీ దేసింగు (2:07:32సె, కర్నాటక), సంజన మంగేశ్ (2:08:89సె, గోవా), వ్రితి అగర్వాల్ (2:09:42సె, తెలంగాణ) వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ఇప్పటికే జాతీయస్థాయిలో లెక్కకు మిక్కిలి పతకాలు కొల్లగొట్టిన వ్రితి నేషనల్ గేమ్స్‌లోనూ సత్తాచాటుతున్నది. మరోవైపు పురుషుల 15 రెడ్ స్నూకర్‌లో రాష్ర్టానికి చెందిన ముస్తాఖ్‌ఖాన్ సెమీస్‌లోకి ప్రవేశించాడు. ఆదివారం జరిగిన క్వార్టర్స్‌లో ముస్తాఖ్ 3-2తో స్పర్శ్ ఫెర్వాణి(మహారాష్ట్ర)పై విజయం సాధించాడు. టోర్నీలో ఎనిమిది పతకాలతో తెలంగాణ ప్రస్తుతం 20వ స్థానంలో కొనసాగుతున్నది.

# ఐదో రౌండ్‌కు వైశాలి

### మాజీ వరల్డ్ చాంపియన్‌పై విజయం

ఇస్లే ఆఫ్ మ్యాన్ : ఫిడే స్విస్ చెస్ టోర్నీలో భారత చెస్ సంచలనం రమేశ్‌బాబు వైశాలి జోరు కొనసాగిస్తున్నది. నాలుగో రౌండ్‌లో రష్యా గ్రాండ్‌మాస్టర్ లియా గారిపుల్లినాకు చెక్ పెట్టిన వైశాలి.. ఆదివారం అద్భుత ఆట తీరుతో మాజీ చాంపియన్ మరియా ముజిచుంక్(ఉక్రెయిన్)ను చిత్తు చేసింది. ఆరంభం నుంచి ప్రత్యర్థిపై ఎదురుదాడికి దిగి కేవలం 23 ఎత్తుల్లోనే మ్యాచ్ ముగించి ఐదో రౌండ్‌కు దూసుకెళ్లింది. తద్వారా 3.5



షుల విభాగంలో తెలంగాణ కుర్రాడు అర్జున్ ఎరిగేసి, ఆర్. ప్రజ్ఞానంద డ్రాతో సరిపెట్టుకోగా.. విదిత్ గుజరాతీ వరుసగా మూడో విజయం నమోదు చేశాడు.

# భారత్ ఆరో విజయం

# జైత్రయాత్ర

- సెమీస్‌లో రోహిత్ సేన!
- నిప్పులు చెరిగిన షమీ, బుమ్రా
- రోహిత్ సూపర్ ఇన్నింగ్స్
- ఇంగ్లండ్‌కు ఐదో పరాజయం
- వన్డే ప్రపంచకప్



షమీ (4/22)

**ఆస్ట్రేలియాపై మొదలైన భారత జైత్రయాత్ర.. నిర్విఘ్నంగా కొనసాగుతున్నది. పుష్కర కాలం తర్వాత స్వదేశంలో జరుగుతున్న వన్డే వరల్డ్‌కప్‌లో టీమ్‌ఇండియా వరుసగా ఆరో విజయంతో అనధికారికంగా సెమీఫైనల్లో అడుగుపెట్టింది. మెగాటోర్నీలో మరే జట్టుకు సాధ్యం కాని రీతిలో సంపూర్ణ ఆధిపత్యం కనబరుస్తున్న రోహిత్ గ్యాంగ్ ముందు.. ఇంగ్లండ్ నిలువలేకపోయింది. షమీ, బుమ్రా వాయు వేగానికి బట్లర్ సేన బిక్కుబిక్కుమంటూ బర్మింగ్‌హామ్ దారి పట్టింది!**

**కింగ్ కోహ్లీ డకౌట్.. గిల్, శ్రేయస్ కూడా వెనుదిరిగారు.. ఇక భారత్ కోలుకోవడం కష్టమే అని సందేహిస్తున్న సమయంలో రోహిత్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా.. రాహుల్, సూర్యకుమార్ తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించారు. ఫలితంగా ఇంగ్లిష్ టీమ్ ముందు 230 పరుగుల లక్ష్యం నిలువగా.. ఈజీ టార్గెట్‌ను కూడా ఛేదించలేక బట్లర్ సేన బొక్కబోర్లా పడింది. బుమ్రా, షమీ బుల్లెట్ల వంటి బంతులు విసురుతుంటే.. పెవిలియన్ చేరడం తప్ప తమకు మరో దారి లేదన్నట్లు ఒకరి వెంట ఒకరు డగౌట్ బాట పట్టడంతో టీమ్‌ఇండియా సిక్సర్ కొట్టింది!**

లక్నో: వన్డే ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియా జోరు కొనసాగుతున్నది. అప్రతిహతంగా దూసుకెళ్తున్న రోహిత్ సేన ఇంగ్లండ్‌ను చిత్తు చేసి మెగాటోర్నీలో ఆరో విజయం ఖాతాలో వేసుకుంది. ఆదివారం లక్నో వేదికగా జరిగిన పోరులో భారత్ 100 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను మట్టికరిపించింది. ఆడిన ఆరు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన భారత్ దాదాపు సెమీఫైనల్లో అడుగుపెట్టగా.. మరోవైపు ఆరింట కేవలం ఒకే మ్యాచ్‌లో నెగ్గిన ఇంగ్లిష్ టీమ్ అధికారికంగా నాకౌట్ రేసు నుంచి తప్పుకుంది. టాస్ గెలిచిన ఇంగ్లండ్ కెప్టెన్ బట్లర్.. టీమ్‌ఇండియాను బ్యాటింగ్‌కు ఆహ్వానించగా.. ఈ ప్రపంచకప్‌లో తొలిసారి లక్ష్యాన్ని నిర్దేశించే అవకాశం దక్కిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 229 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (101 బంతుల్లో 87; 10 ఫోర్లు, 3 సిక్సర్లు) మినహా.. టాపార్డర్ విఫలం కాగా.. బంతి కాస్త ఆగి వస్తున్న స్లో పిచ్‌పై మిడిలార్డర్‌లో సూర్యకుమార్ యాదవ్ (47 బంతుల్లో 49; 4 ఫోర్లు, ఒక సిక్సర్), కేఎల్ రాహుల్ (39) రాణించారు. యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (9) ఎక్కువసేపు నిలువలేకపోగా.. కోహ్లీ (0) వరల్డ్‌కప్ చరిత్రలో తొలిసారి డకౌటయ్యాడు. చివర్లో జస్ప్రీత్ బుమ్రా (16), కుల్దీప్ యాదవ్ (9 నాటౌట్) విలువైన పరుగులు జోడించారు. ఇంగ్లండ్ బౌలర్లలో డేవిడ్ విల్లీ 3.. క్రిస్ వోక్స్, ఆదిల్ రషీద్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం ఊరించే లక్ష్యఛేదనలో ఇంగ్లిష్ బ్యాటర్లు పూర్తిగా తడబడ్డారు. కనీసం ఒక్కరైనా పోరాట పటిమ కనబర్చలేకపోయారు. ఫలితంగా ఇంగ్లండ్ 34.5 ఓవర్లలో 129 పరుగులకు ఆలౌటైంది. లియామ్ లివింగ్‌స్టోన్ (27) టాప్ స్కోరర్ కాగా.. జో రూట్ (0), బెన్ స్టోక్స్ (0), జానీ బెయిర్‌స్టో (14), డేవిడ్ మలాన్ (16), జోస్ బట్లర్ (10), మోయిన్ అలీ (15), క్రిస్ వోక్స్ (10) విఫలమయ్యారు. భారత బౌలర్లలో మహమ్మద్ షమీ 4, బుమ్రా 3 వికెట్లు పడగొట్టారు. రోహిత్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. మెగాటోర్నీలో భాగంగా తదుపరి మ్యాచ్‌లో గురువారం శ్రీలంకతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది.

## రోహిత్ శర్మ కెప్టెన్ ఇన్నింగ్స్



రోహిత్ (87)

*'క్లాస్‌రూమ్‌లో ఎవడైనా జవాబు చెబుతాడు.. కానీ పరీక్షలో సరిగ్గా రాసినవాడే టాపర్ అవుతాడు'* అనే సినిమా డైలాగ్ లాగా.. ప్రస్తుత తరంలో తాను ఎందుకు ప్రత్యేకమో రోహిత్ శర్మ మరోసారి నిరూపించాడు. ప్రపంచకప్‌లో ఈ మ్యాచ్‌కు ముందు వరకు భారత్ ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ చేజింగ్ చేయగా.. అందులో దాదాపు అన్నీ మ్యాచ్‌ల్లో రోహిత్ వందకు పైగా స్ట్రయిక్‌రేట్‌తో రెచ్చిపోయాడు. జట్టుకు మెరుపు ఆరంభాన్నివ్వడమే తన ప్రథమ కర్తవ్యం అన్నట్లు చెలరేగిపోయాడు. అయితే తొలిసారి మెగాటోర్నీలో భారత బ్యాటింగ్‌కు పరీక్ష ఎదురైంది. పిచ్ నుంచి సహకారం లభిస్తుండటంతో ఇంగ్లిష్ సీమర్లు రెచ్చిపోతుంటే.. భారత్ 40 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో జట్టును నడిపించాల్సిన బాధ్యత తను భుజానెత్తుకున్న రోహిత్ శర్మ.. తన శైలికి భిన్నంగా నెమ్మదిగా ఆడుతూ పరుగులు రాబట్టాడు. పవర్‌ప్లేలో బౌలర్లను చీల్చి చెండాడుతాడని పేరున్న రోహిత్ ఒక దశలో బౌండ్రీలు కొట్టడమే మరిచిపోయినట్లు తన వికెట్‌ను జాగ్రత్తగా కాపాడుకుంటూ స్కోరుబోర్డును ముందుకు తీసుకెళ్లాడు. ఎప్పుడో అరుదుగా గానీ డకౌట్ కాని విరాట్ వెనుదిరగడంతో హిట్టింగ్ నుంచి సెట్టింగ్‌కు మారిన రోహిత్.. 37వ ఓవర్ వరకు క్రీజులో పాతుకుపోయి ఇన్నింగ్స్‌కు ఇరుసులా నిలిచాడు. వరల్డ్‌కప్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో ఆడిన తొలి మ్యాచ్‌లో రెండు పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ టీమ్‌ఇండియాను విరాట్ ఎలా ఆదుకున్నాడో.. అచ్చం అలాగే రోహిత్ నేనున్నానని నిలబడ్డాడు. బ్యాటింగ్‌కు కష్టతరమైన పిచ్‌పై చక్కటి ఇన్నింగ్స్ ఆడిన హిట్‌మ్యాన్ సెంచరీకి చేరువైన తర్వాత ఔట్ కాగా.. రాహుల్, సూర్యకుమార్ చక్కటి బ్యాటింగ్‌తో భారత జట్టు పోరాడే స్కోరు చేయగలిగింది.

> "ఎప్పుడో గానీ ఇలాంటిది జరగదు. పేస్ బౌలర్లు పరిస్థితులను చక్కగా అర్థం చేసుకున్నారు. పిచ్ నుంచి కాస్త సహకారం లభిస్తుండటంతో బుమ్రా, షమీ చెలరేగిపోయారు. జట్టులో సీమర్లకు తోడు మంచి స్పిన్నర్లు ఉండటం కలిసొచ్చింది. ప్రతి ఒక్కరు బాధ్యత గుర్తెరిగి ఆడారు. మొదటి ఐదు మ్యాచ్‌ల్లో చేజింగ్ చేస్తే.. ఈసారి టార్గెట్ నిర్దేశించాల్సి వచ్చింది. పిచ్ బ్యాటింగ్‌కు కాస్త కష్టంగా ఉండటంతో వీలైనన్ని పరుగులు చేసి బౌలర్లకు బాధ్యతలు ఇవ్వాలనుకున్నాం. అయినా అనుకున్న దానికంటే 30 పరుగుల వరకు తక్కువ చేశాం. తొలి పవర్‌ప్లేలో మూడు వికెట్లు కోల్పోవడం దెబ్బకొట్టింది.
>
> -రోహిత్, భారత కెప్టెన్

**సంక్షిప్త స్కోర్లు**

భారత్: 50 ఓవర్లలో 229/9 (రోహిత్ 87; సూర్యకుమార్ 49; విల్లీ 3/45, వోక్స్ 2/33), ఇంగ్లండ్: 34.5 ఓవర్లలో 129 ఆలౌట్ (లివింగ్ స్టోన్ 27; షమీ 4/22, బుమ్రా 3/32).

**1** ఐసీసీ వరల్డ్‌కప్ చరిత్రలో విరాట్ కోహ్లీ డకౌట్ కావడం ఇదే తొలిసారి.

**5** అంతర్జాతీయ క్రికెట్‌లో 18 వేల పరుగుల మైలు రాయిని దాటిన ఐదో భారత ప్లేయర్‌గా రోహిత్ నిలిచాడు.

| | |
|---|---|
| రోహిత్ శర్మ | 18,040 |
| సచిన్ టెండూల్కర్ | 34,357 |
| విరాట్ కోహ్లీ | 26,121 |
| రాహుల్ ద్రవిడ్ | 24,208 |
| సౌరవ్ గంగూలీ | 18,575 |


**ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక**

| దే | ఆ | గె | ఓ | ర.రే. | పా |
|---|---|---|---|---|---|
| భారత్ | 6 | 6 | 0 | +1.40 | 12 |
| దక్షిణాఫ్రికా | 6 | 5 | 1 | +2.03 | 10 |
| న్యూజిలాండ్ | 6 | 4 | 2 | +1.23 | 8 |
| ఆస్ట్రేలియా | 6 | 4 | 2 | +0.97 | 8 |
| శ్రీలంక | 5 | 2 | 3 | -0.20 | 4 |
| పాకిస్థాన్ | 6 | 2 | 4 | -0.38 | 4 |
| అఫ్గానిస్థాన్ | 5 | 2 | 3 | -0.96 | 4 |
| నెదర్లాండ్స్ | 6 | 2 | 4 | -1.27 | 4 |
| బంగ్లాదేశ్ | 6 | 1 | 5 | -1.33 | 2 |
| ఇంగ్లండ్ | 6 | 1 | 5 | -1.65 | 2 |

నోట్: దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్


## కనీసం పోరాడకుండానే!

ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగి ఇప్పటి వరకు పెద్దగా ఆకట్టుకోలేకపోయిన ఇంగ్లండ్ ఈ సారి కూడా అదే పేలవ ఆటతీరు కనబర్చింది. పదో స్థానం వరకు హిట్టర్లతో నిండి ఉన్న ఇంగ్లిష్ టీమ్ ముందు స్వల్ప లక్ష్యమే నిలిచినా.. నాణ్యమైన భారత పేస్‌ను ఎదుర్కోలేక బట్లర్ సేన చేతులెత్తేసింది. మలాన్‌ను ఔట్ చేయడం ద్వారా బుమ్రా వికెట్ల పతనానికి తెరతీయగా.. ఇక చివరి వరకు ఆ పరంపర కొనసాగింది. ముఖ్యంగా ప్రపంచకప్‌లో తొలి నాలుగు మ్యాచ్‌లకు దూరమైన సీనియర్ పేసర్ షమీ.. తనను పక్కనపెట్టి భారత టీమ్ మేనేజ్‌మెంట్ ఎంత పెద్ద తప్పు చేసిందో మరోసారి నిరూపించాడు. గత మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై 5 వికెట్లు పడగొట్టిన షమీ.. ఈసారి నాలుగు వికెట్లతో సత్తాచాటాడు. అసలు షమీ బంతిని ఎదుర్కోవాలంటేనే ఇంగ్లండ్ బ్యాటర్లు వణికిపోయారనడంలో అతిశయోక్తి లేదు. తొలి ఐదు ఓవర్లలో అతడు 2 మెయిడెన్లు వేసి 5 పరుగులు మాత్రమే ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. అందులో బెన్‌స్టోక్స్, బెయిర్‌స్టో, మోయిన్ అలీ వికెట్లు ఉన్నాయి. ఒక ఎండ్ నుంచి బుమ్రా ఒత్తిడి తెస్తుంటే.. మరో ఎండ్ నుంచి షమీ విజృంభించాడు. వీరిద్దరి బౌలింగ్ వాడికి నలిగిపోయిన ఇంగ్లిష్ ప్లేయర్లు ఒకరి వెంట ఒకరు డ్రెస్సింగ్ రూమ్‌కు క్యూ కట్టారు.



షమీ బౌలింగ్‌లో స్టోక్స్(0) క్లీన్‌బౌల్డ్

# శ్రీలంక X అఫ్గానిస్థాన్



షాహిదీ

పుణె: గత మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై ఘన విజయం సాధించి ఫుల్ జోష్‌లో ఉన్న అఫ్గానిస్థాన్ జట్టు.. మరో పోరుకు సిద్ధమైంది. సోమవారం పుణె వేదికగా శ్రీలంకతో అఫ్గాన్ అమీతుమీ తేల్చుకోనుంది. పాక్‌ను స్పిన్ ఉచ్చులో బిగించి ఉక్కిరి బిక్కిరి చేసిన అఫ్గాన్.. అదే జోరు కొనసాగించాలని చూస్తుంటే.. సెమీస్ రేసును రసవత్తరం చేయాలని శ్రీలంక కాచుకొని కూర్చుంది. అయితే గాయాలు లంకను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. టోర్నీకి ముందే వణిందు హసరంగ దూరం కాగా.. ఆ తర్వాత కెప్టెన్ షనక వరల్డ్‌కప్ నుంచి వెనుదిరిగాడు. తాజాగా ప్రాక్టీస్ సెషన్‌లో గాయపడ్డ పేస్ బౌలర్ లహిరు కుమార ప్రపంచకప్ నుంచి తప్పుకోగా.. అతడి స్థానంలో దుష్మంత చమీర టీమ్‌లోకి వచ్చాడు. ఇరు జట్లు వరల్డ్‌కప్‌లో ఇప్పటి వరకు ఐదేసి మ్యాచ్‌లు ఆడి రెండేసి విజయాలతో చెరో నాలుగు పాయింట్లు ఖాతాలో వేసుకున్న నేపథ్యంలో ఇరు జట్లకు ఈ మ్యాచ్ కీలకం కానుంది.

# టీటీ చాంప్స్ త్రిశాల్, శృతి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: సీబీఎస్‌ఈ క్లస్టర్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో త్రిశాల్‌రాజ్‌కుమార్, శ్రీశృతి విజేతలుగా నిలిచారు. ఆదివారం జరిగిన అండర్-19 బాలుర ఫైనల్లో త్రిశాల్(శ్రీ ప్రకాశ్ సినర్జీ స్కూల్) 3-0(11-9, 11-8, 11-5)తో క్రిష్ సప్తర్షి(చిరెక్ ఇంటర్నేషనల్)పై అద్భుత విజయం సాధించాడు. మరోవైపు బాలికల విభాగంలో శృతి( 3-2(3-11, 4-11, 11-5, 11-8, 12-10)తో సుశ్మిత(హ్యాపీ వ్యాలీ స్కూల్)పై గెలిచి టైటిల్ సొంతం చేసుకుంది. అండర్-17 విభాగంలో శౌర్య రాజ్ సక్సేనా, చైత్రా రెడ్డి విజేతలుగా నిలిచారు. మిగతా విభాగాల్లో మనోహర్, సమృద్ధి టైటిళ్లు దక్కించుకున్నారు.



## రగ్బీ ప్రపంచకప్

# విజేత దక్షిణాఫ్రికా

### ఫైనల్లో న్యూజిలాండ్‌పై విజయం



పారిస్: ప్రతిష్ఠాత్మక రగ్బీ ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా విజేతగా నిలిచింది. డిఫెండింగ్ చాంపియన్ హోదాకు న్యాయం చేకూరుస్తూ రికార్డు స్థాయిలో నాలుగోసారి ప్రపంచకప్‌ను సగర్వంగా ముద్దాడింది. ఆదివారం ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన ఫైనల్లో దక్షిణాఫ్రికా 12-11తో న్యూజిలాండ్‌పై చరిత్రాత్మక విజయం సాధించింది. ఆల్‌బ్లాక్స్ కెప్టెన్ సామ్ కేన్..ఫైనల్లో రెడ్‌కార్డ్‌కు గురైన తొలి ప్లేయర్‌గా నిలిచాడు. ఫ్లై హాఫ్ హాండ్రె పొలార్డ్..దక్షిణాఫ్రికా తరఫున అద్భుత ప్రదర్శన కనబరిచాడు. కివీస్ టైటిల్ ఆశలపై నీళ్లు చల్లుతూ సఫారీలకు కీలక పాయింట్లు సాధించిపెట్టాడు. సఫారీ కెప్టెన్ సియా కొలిసీ..ప్రపంచకప్‌ను ముద్దాడుతూ సహచరులతో కలిసి సంబురాల్లో మునిగిపోయాడు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.